www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 14 అక్టోబర్ 2024

5

తిరుపతి

ఆగస్తీశ్వరాలయంలో పైకప్పు లీకేజీలు



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి గ్రామంలో వెలసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర ఆలయ అనుబంధ దేవాలయం అగస్తీశ్వర ఆలయంలో చిన్నపాటి వర్షానికే పైకప్పు నుంచి లీకేజీలు ఏర్పడ్డాయి. గతేడాది రూ.12లక్షల వ్యయంతో ఆలయానికి మరమ్మతులు చేయించారు. ఏడాది కూడా తిరగకుండానే పైకప్పు నుంచి లీకేజీలు ఏర్పడడంతో పనులు నాసిరకంగా చేశారన్న విమర్శలు వస్తున్నాయి. గత పాలకులు కాసులకు కక్కుర్తిపడి పనుల నాణ్యతపై దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తందని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈవో స్పందించి సత్వరమే సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

- అప్రమత్తమైన యంత్రాంగం
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- సెలవుల్లో ఉన్న అధికారులు వెంటనే విధుల్లోకి చేరాలి : కలెక్టర్

జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

బంగాళాఖాతంలో సోమవారానికి అల్పపీడనం ఏర్పడనుందనే హెచ్చరికలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖవారి హెచ్చరికల నేపథ్యంలో ఈనెల అక్టోబర్ 14 నుంచి 17 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. తుపాన్ నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ముందస్తు చర్యలు చేపట్టి 24×7 కంట్రోల్ రూం పనిచేసేలా ఏర్పాటుతో ఎలాంటి విపత్తునైన ఎదుర్కునేలా సిద్ధంగా ఉండి ఎలాంటి మానవ ప్రాణ, పశు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ ఎస్పి సుబ్బరాయుడు, జెసి శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, జిల్లా అధికారులతో కలిసి అన్ని రెవెన్యూ డివిజన్ల, మండల, గ్రామ, వార్డు సచివాలయ అధికారులతో రానున్న భారీ వర్షాల అప్రమత్తతపై ముందస్తు చర్యల్లో భాగంగా చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రానున్న నాలుగు రోజుల్లో అక్టోబర్ 14 నుంచి 17 వరకు రాయలసీమ జిల్లాలలోని సత్యసాయి జిల్లా, అన్నమయ్య జిల్లా, చిత్తూరు జిల్లా, తిరుపతి, కడప తదితర జిల్లాలలో భారీ వర్షాలు కురువనున్నాయని, ఈ నేపథ్యంలో హోంశాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రెవెన్యూ వారు శనివారం ఈ అంశంపై సమీక్షించారని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా తిరుపతి జిల్లాలో తీరప్రాంత మండలాలైన గూడూరు డివిజన్లోని చిల్లకూరు, వాకాడు, కోట సూల్లూరుపేట డివిజన్ తడ తదితర తీరప్రాంత మండలాలు, గ్రామాల పరిధిలోని అధికారులు మరింత అప్రమత్తతో వ్యవహరించాల్సి ఉందని, అలాగే జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు మున్సిపాలిటీలలో ఎలాంటి మానవ పశుప్రాణ నష్టం సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉందని, అధికారులు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలనీ ఆదేశించారు. ముఖ్యంగా తిరుపతి పట్టణంలో భారీ వర్షాలు కురిస్తే పట్టణ ప్రాంతం నీట మునగకుండా ఫ్లడ్ డ్రైన్లు కాలువలు డీసిల్టేషన్ చేపట్టి, మురుగు నీరు సాఫీగా పారే విధంగా చెత్త నిలువ లేకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అలాగే అన్ని మునిసిపాలిటీ, పంచాయతీలలో కూడా కాలువలు శుభ్రపరచాలని అన్నారు. జిల్లా, డివిజన్ మండల కేంద్రాలలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని అందులో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయశాఖ, హార్టికల్చర్, విద్యుత్ తదితర సంబంధిత శాఖలు అధికారులు ఉండాలని 24/7 ఈ కంట్రోల్ రూములు పని చేయాలని వాటికి సంబంధించిన ఫోన్ నెంబర్లను మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. పునరావాస ఏర్పాట్లు సిద్ధం చేయాలని, ప్రభుత్వ అధికారులు , సిబ్బంది సెలవుల్లో వుంటే వెంటనే విధుల్లో చేరి వారి ప్రధాన కార్యస్థానంలో అందుబాటులో వుండాలని ఆదేశించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది స్థానికంగానే 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. డివిజన్ స్థాయిలో ఆర్‌డిఓలు, డిఎస్‌పిలు తమపరిధిలో ఎలాంటి మానవ, పశు సంపద నష్టం జరగకుండా ప్రణాళికలు చేపట్టి, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీచేసి ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాలలో అధికారులు పర్యటించి అవసరమున్న చోట చేపట్టాల్సిన పునరావాస కేంద్రాలు , లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. మండల స్థాయిలో తహసిల్దారులు ఎస్‌హెచ్‌ఓలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, పెట్రోల్ బంకులో డీజల్, పెట్రోల్ అత్యవసర పరిస్థితుల్లో తగినంత స్టాక్ ఉండేలా చూడాలని, గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో, పట్టణాల్లో డిపిఓ, మునిసిపల్ శాఖలు సోమవారం మురికి కాలువలు పూర్తిస్థాయిలో శుభ్రపరచాలనీ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ రక్షిత మంచినీటి ఏర్పాటులో అవాంతరం లేకుండా, బ్లీచింగ్ సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. రహదారులకు సంబంధించి పంచాయతీ రాజ్, ఆర్అండ్ బి శాఖలు ఇరిగేషన్ శాఖ చెరువులు, వాగులు, వంకల వద్ద, కాజ్వేల వద్ద వారి సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. విపత్తు నిర్వహణలో ఎప్పుడు పూర్తి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సముద్రతీర ప్రాంతంలో ఉన్న గ్రామాల మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్ళి ఉంటే వారిని సత్వరమే వెనక్కి వచ్చేలా చూడాలని, అలాగే రానున్న నాలుగు రోజులు ఈ నెల 17 వరకు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు ఎట్టి పరిస్థితుల్లో వెళ్లరాదని అనుమతి లేదని ఈవిషయాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులు, మత్స్యశాఖ అధికారులు టామ్ టామ్, ఇతర మార్గాల ద్వారా వారికి తెలపాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఇబ్బందులు తలెత్తితే వెంటనే పునరుద్ధరణ జరగాలన్నారు. కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నత్త నడకన తుడా టవర్స్

- నిధులు లేక ముందుకు సాగని పనులు
- ప్రత్యామ్నాయ కోసం విసి ప్రయత్నాలు

తుడా టవర్స్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 14 అంతస్తుల తుడా టవర్స్ నిర్మాణం అయోమయంలో పడింది. వైసిపి ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ పనులు రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం, కొత్త అధికారులు రావడంతో నిధులు లేక పనులు నత్తనడక సాగుతున్నాయి.

తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య కూడలిని అనుకుని ఉన్న 3.01 ఎకరాల తుడా స్థలంలో రూ.275ల కోట్ల అంచనాలతో నిర్మిస్తున్న వాణిజ్య, గృహావసరాల భవన నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. 2023 జూలైలో ప్రారంభమైన పనులు మందకొడిగా సాగుతూ ఇప్పటికి పునాదుల దశ దాటి మొదటి అంతస్తు పనులు మాత్రమే పూర్తయ్యాయి. తుడా సాధారణ నిధుల నుంచి రూ.41కోట్లు బిల్లులు మాత్రమే చెల్లించారు. తుడాలో నిధులు ఖాళీ కావడంతో గుత్తేదారు సంస్థకు చెల్లించాల్సిన బిల్లులు అలస్యం ఆవతుండడంతో ఎన్నికల తరువాత పనులు పూర్తిగా మందగించాయి. తుడాలో విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం జరుగుతోందని, టవర్స్ నిర్మాణంపై అనుమానాలు వ్యక్తం కావడంతో కొనుగోలుదారులు వెనుకంజ వేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో తుడాపై సన్నగిల్లిన నమ్మకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలబెట్టి తుడా టవర్స్ నిర్మాణం పూర్తి చేయగలిగితే తుడాకు రూ.150కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలోనే పట్టణాభివృద్ధి సంస్థల్లో తుడా ఆదాయార్జనలో ముందుందని, ఏటా జీతాలే రూ.15కోట్లు చెల్లిస్తున్న ఏకైక పట్టణాభివృద్ధి సంస్థని ఇటీవల మంత్రి నారాయణ పేర్కొన్నారు. తుడా ప్లాట్ల అమ్మకాల ద్వారా సుమారు రూ.500కోట్ల వరకు లాభం ఆర్జించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంతటి ఆదాయం కలిగిన తుడా చేపట్టిన తుడా టవర్స్ నిర్మాణానికి నిధులు లేక అవస్థలు పడుతోంది. ప్రస్తుతం తుడా ఖాతాలో రూ.7కోట్ల నిధులు మాత్రమే మిగలడంతో అవి సాధారణ ఖర్చుల కోసం నిల్వ చేసుకున్నారు. టవర్స్ నిర్మాణం పూర్తి కావాలంటే మరో రూ.200కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ నిధులు సమకూర్చడం ఇప్పట్లో సాధ్యం అయ్యే పనికాదని భావిస్తున్నారు. ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి తుడా అస్తుల తనఖా ద్వారా రూ.50కోట్ల రుణం తీసుకుని గుత్తేదారుకు చెల్లించి పనులు వేగవంతం చేయాలని అధికారులు ప్రయత్నించిన ప్పటికీ అది ఫలించిలేదని తెలిసింది.

ధరలు చూసి వెనక్కు తగ్గుతున్న వినియోగదారులు

తుడా టవర్స్‌లోని ప్లాట్లు, వాణిజ్య, కార్యాలయ సముదాయాలకు చదరపు అడుగుకు నిర్ణయించిన ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్లాట్లు, వాణిజ్య దుకాణాలు ముందస్తుగా విక్రయించాలని ఈ-వేలం ద్వారా ప్రయత్నించినా కేవలం 11మంది మాత్రమే ప్లాట్లు కొనుగోలుకు అడ్వాన్సులు చెల్లించారు. డబుల్ బెడ్ రూమ్ ప్లాట్ కొనుగోలుకు రూ.72లక్షలు, త్రిబుల్ బెడ్ రూమ్ గదులకు రూ.1.20కోట్లు, నాలుగు పడక గదులను రూ.2.20 కోట్లకు విక్రయించేలా ధరలు నిర్ణయించారు. వాణిజ్య సముదాయంలో చదరపు అడుగు ధర రూ.12 వేలు వరకు ఉంది. వీటిని పరిశీలించిన వినియోగదారులు తుడా టవర్స్ కొనుగోలుకు ఆసక్తి కనబరచలేదు. తుడా వీసీగా బాధ్యతలు చేపట్టిన మౌర్య తుడా టవర్స్ పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ విషయం మున్సిపల్ పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ దృష్టికి మౌర్య తీసుకెళ్లారు. తుడాకు నష్టం వాటిల్లకుండా వీసి మౌర్య చర్యలు చేపట్టారు. తుడా టవర్స్ పనులు సకాలంలో పూర్తి చేస్తే తుడాకు ఆదాయ వనరులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

తుడా టవర్స్ పనులను పరిశీలిస్తున్న వీసీ ఎన్.మౌర్య (ఫైల్ ఫోటో)

ధ్వజావరోహణంతో

ముగిసిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ధ్వజావరోహణంతో ముగిశాయి. రాత్రి 7 గంటలకు బంగారు తిరుచ్చి ఉత్సవం జరిగింది. అనంతరం ధ్వజావరోహణంతో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

పెద్దకనపర్తిలో ట్రెంచ్ ఏర్పాటు

'ప్రజాశక్తి వార్త'కు స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామం వద్ద స్వర్ణముఖి నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టకుండా శనివారం రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ప్రజాశక్తిలో శనివారం 'రూటుమార్చిన ఇసుకాసురులు' అన్న శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి పెద్దకనపర్తి వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని తొట్టంబేడు తహశీల్దారు మధుసూదన్ రావును ఆదేశించారు. ఆ మేరకు ఆయన రెవెన్యూ, పోలీసు సిబ్బందితో వెళ్లి దారికి అడ్డంగా ట్రెంచ్ కొట్టి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా స్వర్ణముఖి నదిలో ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ మధుసూదన్ రావు, ఎస్ఐ ఈశ్వరయ్య హెచ్చరించారు. వీఆర్వో కృష్ణయ్య, సీనియర్ అసిస్టెంట్ నారాయణ, తలారి అంకయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

14న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం వలన భారీ వర్షాలు కురవనుండడంతో ప్రజలకు సహాయ చర్యలు అందించేందుకు వీలుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కంట్రోల్ రూములో 24 గంటలు నగరపాలక సంస్థ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. తుపాను వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూము నంబర్ 0877 2256766ను సంప్రదించాలని పేర్కొన్నారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు ఎక్కువగా కురవనున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి సహాయక చర్యలకైనా కంట్రోల్ రూమును సంప్రదించాలని ప్రజలను కోరారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేశామని, ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి రావొద్దని కమిషనర్ తెలియజేశారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దు

కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): నైరుతి బంగాళాఖాతంలో సోమవారానికి అల్పపీడనం ఏర్పడనుందనే హెచ్చరికలు, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖవారి హెచ్చరికల నేపథ్యంలో రాయలసీమ జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం 14న జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహణ రద్దు చేస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు విషయాన్ని గమనించి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వ్యయప్రయాసలకోర్చి రావద్దని, అలాగే డివిజన్, మండల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలు కూడా రద్దు చేస్తున్నట్లుగా తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జిల్లాలో ప్రత్యేక ప్రణాళికతో కార్యక్రమాలు: డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు

ఇంటర్వ్యూ

డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు పథకాలతోపాటు డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు రుణసదుపాయలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఏ పిడి శోభన్ బాబు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రత్యేక ప్రణాళికలతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళకు సంపాదన పెరిగేలా అవసరమైన రుణ సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో మహిళలను ఆర్థిక చైతన్యవంతులుగా ఎదిగేలా చేయడానికి మరింతగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి: డ్వాక్రా సంఘాల ఆర్థిక ప్రగతి కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

డిఆర్‌డిఏ పిడి: డ్వాక్రా సంఘాల నిర్వహణలో కొద్దిపాటి మార్పులు చేసుకుంటూ వాటిని ఆర్థిక ప్రగతి వైపు అడుగులు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సంఘాలను ఎప్పటికప్పుడు మదింపు చెయ్యడం ద్వారా సంఘాల సమావేశాల నిర్వహణలో నాణ్యత పెరుగుతుంది. తద్వారా సంఘసభ్యుల మధ్య పోటీతత్వం పెంచడం, వారు చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి వీలు అయ్యోలా దోహదపడుతుంది.

ప్రజాశక్తి: డ్వాక్రా సంఘాలకు సంబంధించి నూతన యాక్షన్ ప్లాన్ ఏదైనా తయారు చేశారా?

డిఆర్‌డిఏ పిడి: తిరుపతి జిల్లా పరిధిలో డ్వాక్రా సంఘాల ఆర్థిక అభివృద్ధికి కోసం వికసిత్ ఆంధ్రలో భాగంగా స్వర్ణాంధ్ర 2047 పేరుతో ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశాం. దీని ద్వారా డ్వాక్రా సంఘాల సభ్యుల ఆర్థిక ప్రగతికి అవసరమైన అన్ని విధానాలను యాక్షన్ ప్లాన్‌లో పొందుపరిచాం. దీన్ని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచనలతో పగడ్బందీగా అమలు చేస్తే మరింతగా డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

ప్రజాశక్తి: సంఘాల్లో చదువుకున్న వారి కోసం ఏదైనా కొత్త రుణ సదుపాయాలు ఉన్నాయా?

డిఆర్‌డిఏ పిడి: డ్వాక్రా సంఘాల సభ్యుల్లో డిగ్రీ విద్యార్హతతో ఉన్నవారి కోసం నైబర్ హుడ్ బిజినెస్ యూనిట్స్ (ఎన్బియూ)ను ఏర్పాటు చేశాం. ఇవి ఇప్పటికి తిరుపతి జిల్లా పరిధిలో 37వరకు ఉన్నాయి. వీటిని సంఖ్యాపరంగా పెంచి డిగ్రీ విద్యార్హత ఉన్న వారికి ఉపాధి అవకాశాలను స్కిల్స్‌పరంగా చూపుతున్నాం. ఇటీవల కేంద్ర ప్రభుత్వ పథకం అయిన పిఎంఎఫ్ఎంఇను డ్వాక్రా సంఘాల సభ్యులకు అనుసంధానం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. త్వరలో దీనికి సంబందించి సర్క్యూలర్ రాగానే అర్హులైన వారిని గుర్తించి 6శాతం వడ్డీతో రూ.40వేల రుణ సదుపాయాలను కల్పిస్తాం.

ప్రజాశక్తి: సంఘసభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు అమ్మకాల కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు ఏమిటి?

డిఆర్‌డిఏ పిడి: డ్వాక్రా మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించడానికి వివిధ స్కీంల ద్వారా రుణాలను మంజూరు చేయిస్తున్నాం. వారు తయారు చేసిన చేతి వృత్తులు, ఫుడ్ ప్రొడెక్ట్స్‌కు ఆన్‌లైన్ డిజిటల్ కామర్స్ ద్వారా 'మె స్టోర్ యాప్' తో ప్రపంచంలో ఎక్కడికైనా వారి ఉత్పత్తులను అమ్ముకునే వెసులు బాటును తీసుకోస్తున్నాం. మన దేశంలో ఇప్పటికే డ్వాక్రా బజార్ల ద్వారా డ్వాక్రా సంఘాలకు సంబందించిన సభ్యులు వారి ఉత్పత్తులను వారే డ్వాక్రా బజార్‌ల ద్వారా విక్రయాలు చేసుకుంటూ వారి కుటుంబాలకు ఆసరాగా తయారయ్యారు. ప్రస్తుతం ఢిల్లీలో జరుగుతున్న డ్వాక్రా బజార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా సంఘాల సభ్యులు వారి ఉత్పత్తులను అమ్మకాలు చేసుకోవడానికి వెళ్లారు.

ఇద్దరు మిత్రులు.. బద్ద శత్రువులు

- దసరా నాడు కాలు రువ్విన సారధి, పులి
- పరుగులు పెట్టిన భక్తులు



ముత్యాల పార్ధసారధి



పులి రామచంద్ర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వాళ్లిద్దరూ ఒకప్పుడు ప్రాణమిత్రులు.. సామాజిక వర్గాలు వేరైనా.. టీడీపీ అనే రాజకీయ బడిలో అంతరాలు మాని కలిసి చదువుకున్నారు. వ్యాపారాలు చేశారు. రాజకీయ పదవులు అనుభవించారు. ఇదంతా పదేళ్ల కిందటి మాట. కట్ చేస్తే వాళ్లిద్దరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. ఎక్కడ కనపడ్డా కాలు రువ్వే స్థితికి చేరుకున్నారు. వారెవరో కాదు..! శ్రీకాళహస్తి పట్టణ ప్రజలకు ఎంతో సుపరిచితులైన ప్రాణమిత్రులు మాజీ మున్సిపల్ చైర్మన్ ముత్యాల పార్థసారధి, మాజీ టౌన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ పులి రామచంద్ర. వీరిరువురూ శనివారం దసరా పండుగనాడు భాస్కర్ పేటలో ఉన్న శక్తి స్వరూపిణీ చాముండేశ్వరి అమ్మవారి ఎదుటే ఒకరిపై ఒకరు దుర్భాషలాడుతూ కర్రలతో దాడి చేసుకునేందుకు ప్రయత్నించారు. వీరితో పాటు వారి అనుచరులు కూడా కర్రలు పట్టుకుని దూకడంతో భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడ ఏర్పడ్డ గందరగోళ పరిస్థితుల్లో తమపై ఎక్కడ దాడి జరుగుతుందోనన్న భయాందోళనలో అమ్మవారి దర్శనార్థం చాముండేశ్వరీ దేవీ ఆలయానికి వచ్చిన భక్తులు ఒక్కసారిగా పరుగులు పెట్టడం గమనార్హం. ఈ ఘటనపై ఎలాంటి పోలీసు కేసూ నమోదు కాకున్నా పట్టణ ప్రజల్లో పెద్ద చర్చణీయాంశమైంది. రాజకీయంగా, ఆర్థికంగా సామాజికంగా పలుకుబడి ఉన్న ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా ప్రజలు చూస్తుండగానే కర్రలతో దాడి చేసుకోవడమేంటని ముక్కున వేలేసుకుంటున్నారు.

ఆర్థిక విబేధాలే కారణమా..!

సారధి, పులి రామచంద్ర మధ్య గత కొన్నేళ్లుగా ఆర్థిక విభేదాలు పొడ చూపినట్లు తెలుస్తోంది. టీడీపీ హయాంలో వీరు సంయుక్తంగా మద్యం దుకాణాలు నడిపారు. ఓ బార్‌ను కూడా నడుపుతూ వచ్చారు. అయితే 2019లో టిడిపి అధికారం కోల్పోవడంతో వీరి మధ్య విభేదాలు బయటకు వచ్చాయి. ఒకరిపై ఒకరు సామాజిక మాధ్యమాల్లో అవినీతి ఆరోపణలు చేసుకున్నారు. తమ ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీలో చేరారు. తిరిగి సారధి 2024 ఎన్నికలకు ముందు సొంతగూటికి చేరారు. రామచంద్ర వైసీపీలోనే కొనసాగుతున్నారు. ప్రస్తుతం రామచంద్ర చాముండేశ్వరి దేవి ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే పులి రామచంద్ర తన కుటుంబంతో కలిసి ఆలయంలో పూజలు చేస్తుండగా సారధి అక్కడికి చేరుకోవడంతో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఎస్వీయూలో పిజి కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎం.కామ్, ఎం.ఎస్సీ, కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డిఓఏ డైరెక్టర్ ఆచార్య వుకా రమేష్ బాబు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్ల కార్యాలయంలో ఈనెల 14, 15 తేదీల్లో ఎక్కడా సీటు పొందని, పిజి సెట్ 2024లో ర్యాంకు పొందిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లతో హాజరై సీటు పొందవచ్చని కోరారు. మరిన్ని వివరాలకు డీఓఏ డైరెక్టర్ ఆచార్య రమేష్ బాబును (0877-2248589) సంప్రదించాలని తెలిపారు.

పిహెచ్‌డి అభ్యర్థులు డిఓఏ కార్యాలయంలో రిపోర్టు చేయండి

ఎస్వీయూ పరిధిలో ఆర్‌సెట్ 2023 -24 ద్వారా పిహెచ్‌డి సీట్లు పొందిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో డీఓఏ కార్యాలయంలో ఈనెల 14 నుంచి 19వ తేదీ వరకు లోపు రిపోర్టు చేయాలని డిఓఏ డైరెక్టర్ ఆచార్య వుకా రమేష్ బాబు తెలిపారు.

శాప్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: శాప్ చైర్మన్ రవి నాయుడును టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. తిరుపతిలో ఆదివారం కలసిన నాయకులు పుష్పగుచ్ఛలు అందించి, శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలని, అర్హులైన క్రీడాకారులను ప్రోత్సహించి వారి ఉన్నతికి సహాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వళిగళం రూపేష్, కె.రమేశ్, గౌరీశంకర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి హాకీ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఈ ఏడాది జూన్ నెలలో హాకీ ఏపీ ఆధ్వర్యంలో ఏపీ సీనియర్ పురుషుల ఛాంపియన్షిప్ పోటీలు ధర్మవరంలో నిర్వహించారు. అక్కడ హాకీ టీంలో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 25వ తేదీ నుంచి నవంబర్ రెండవ తేదీ వరకు కాకినాడ డిఎస్ఏ స్టేడియంలో జరుగు శిక్షణ శిబిరానికి హాజరు కావాలని క్రీడాకారులకు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిరాజు తెలిపారు. 25న ఉదయం స్టేడియంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆయన కోరారు. సీనియర్ మెన్ హాకీ టీం జిల్లాల వారీగా క్రీడాకారుల వివరాలను రవిరాజు ప్రకటించారు. తిరుపతి జిల్లా నుంచి శాంత కుమార్, ఆరోన్ సరోజ్, ఆనంద్ రాజ్, శ్రీకాంత్, షేక్ ఇర్ఫాన్, శ్రావణ్ ఎంపిక కాగా వివిధ జిల్లాల నుంచి ఎంపికైన వారి పేర్లను నిర్వాహకులు ఒక ప్రకటనలో వివరించారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తిరుపతి మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సంగీత నృత్య నీరాజనం ఆహుతులను అలరించింది. గోపాలం భజే, దేవి బ్రోవ, శరవణభవ, వెంకటేశ నిన్ను, నమో నారాయణ వంటి కీర్తనలు ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు కొల్లూరు వందన గాత్రంపై వారికి మృదంగంపై కోటిపల్లి రమేష్, వయోలిన్‌పై జయరాం సహకరించారు. కార్యక్రమం అనంతరం సంగీత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఉమ ముద్దుబాల వారికి స్వామి వారి లడ్డూ, వడ ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో తిరుమల మాడ వీధులలో కళాశాల సంబంధించిన 41 బృందాలలో 1200 కళాకారులు, తిరుపతి స్టేజి ప్రోగ్రాంలో 250 కళాకారులు పాల్గొని స్వామివారికి సంగీత, నృత్య సేవ చేసుకున్నారని తెలిపారు.

ఘనంగా చేకూరు జనార్దన్ చౌదరి పుట్టినరోజు వేడుకలు

కేక్ తినిపిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం: టీడీపీ సీనియర్ నాయకులు చేకూరు జనార్దన్ చౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం రాత్రి మండల టీడీపీ కార్యాలయంలో దసరా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. జనార్దన్ చౌదరిని దుశ్శాలువాలతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని టిడిపి సీనియర్ నాయకులు జనార్దన్ చౌదరికి శాలువాతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు, కార్యక్రమంలో తిరుమలరెడ్డి, ప్రసాద్, ధనంజయులు, మాధవయ్య, విజయ్ కుమార్ రెడ్డి, మధు రాయల్, ఈశ్వర్ రెడ్డి, అలిమినేని మధు, కత్తి సుధాకర్, మధు, శీను, జగదీష్, ధనుంజయులు, ఉమాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీపీ భారీ విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల పచ్చాలమ్మ ఆలయంలో కళ్యాణ మండపం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఎస్వీపీ నాయుడు ఆదివారం రూ.10లక్షల భారీ విరాళం అందజేశారు. కళ్యాణ మండపం నిర్మాణానికి గ్రామస్తులు ఎస్వీపీని సాయం కోరగా, ఆయనే నేరుగా ఆలయం వద్దకు వెళ్లి విరాళం అందజేశారు. గ్రామస్తులు సుదర్శన్ నాయుడు, హరిబాబు నాయుడు, కన్నయ్య నాయుడు, మాజీ ఎంపిటీసీ వీర రాఘవులు, సురేష్, మునస్వామి ఆచారి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శనివారం టీటీడీ ఉద్యోగుల సంయుక్త కార్యచరణ సమితి ఆధ్వర్యంలో అలిపిరి గరుడ సర్కిల్లో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఉద్యోగుల సంయుక్త కార్యచరణ సమితి అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గత 16ఏళ్లుగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2500 మందికిపైగా భక్తులకు అన్నదానం చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పద్మావతి చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ భరత్, బర్డ్ ఆసుపత్రి డాక్టర్ క్రాంతి పాల్గొని అన్నదానం ప్రారంభించారు. అసోసియే షన్ నాయకులు రత్నం శెట్టి, మోహన్రాజ్, బెల్లకొండ ప్రసాద్, విజయకుమార్ రెడ్డి, అరుణ కుమార్, మురళి, మధు, ఉపేంద్ర, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

- ఆర్‌డీవో భానుప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో కోస్తా రాయలసీమ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారం మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని శ్రీకాళహస్తి ఆర్‌డీవో భాను ప్రకాష్ రెడ్డి ఆదేశించారు. ఈనెల 14 నుంచి 17 వరకు తుఫాను ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందనీ, ఆ మేరకు తగు జాగ్రత్తలు, సూచనలు చేశారు. స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాలతో పాటు మున్సిపాలిటీ, ఆర్‌డీవో కార్యాలయంలోనూ మొత్తం మీద పది చోట్ల కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్‌డీవో కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క మండలంలో మూడు జెసిబిలు, 10ట్రాక్టర్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా చెరువులకు గండి పడితే యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చేలా చూడాలన్నారు. అలాగే లోతట్టు ప్రాంత ప్రజలను చేసి అవసరమైతే పునరావాస కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేయాలని సూచించారు.

వైభవంగా శ్రీకలశ దీప చక్ర హోమం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలంలోని గాంధీపురం పంచాయతీ, శ్రీనగర్ కాలనీలో వెలసిన ఓం శక్తి దేవాలయంలో అమ్మవారికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సుధా రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆదివారం అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా శ్రీ కళస దీప చక్ర హోమంను ఓం శక్తి భక్తులు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో జరిగిన సుమంగళి పూజలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు.

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఎల్ఎస్‌నగర్‌లో శ్రీ చాముండేశ్వరి దేవాలయం, తుమ్మలగుంటలోని శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవాలయాలలో దేవీ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు భాస్కర్ రెడ్డి, బిరుదుల హనుమంత రెడ్డి సోదరులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పులివర్తి నానిని దుశ్శాలువాలతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మధు నాయుడు, ఈశ్వర్ రెడ్డి, కత్తి సుధాకర్, దొడ్ల కరుణాకర్ రెడ్డి, కురకాల్వ సుధాకర్, పరంధాం యాదవ్, చంద్ర ముదిరాజ్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

తుపాన్ ప్రభావంపై సమీక్ష

ప్రజాశక్తి-గూడూరు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుఫాను ప్రభావం ఏపీపై ఉంటుందని, నాలుగు రోజుల రాష్ట్రంలోని విస్తారంగా వర్షాలు కురుసే అవకాశాలు ఉండడంతో జిల్లా కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించి అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మండల స్థాయి అధికారులతో తుఫాన్ ప్రభావంపై సమీక్ష నిర్వహించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలు, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూధన్ రావు, పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల గ్రామోత్సవం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో కొలువై ఉన్న నారాయణమ్మ పేరంటాలు అమ్మవారి గ్రామోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉత్సవంలో కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ అలంకారాలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా వాలయానందపురంలో మహాలక్ష్మమ్మ అమ్మవారి గ్రామోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. వివిద వేషధారణలనడుము, మేళతాళాలు మధ్య అమ్మవారిని ఊరేగించారు. హైస్కూల్ రోడ్డులో వెలసియున్న రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బిఎస్ స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

స్పోర్ట్స్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాను ప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో శివ సాయి నగర్ లో నూతనంగా నిర్మించిన బిఎస్ స్పోర్ట్స్ క్లబ్‌ను ఆదివారం ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు యువత ఈ స్పోర్ట్స్ క్లబ్‌ను ఉపయోగించ వలసిందిగా ఆయన కోరారు. ఎమ్మెల్యే భాను చురుగ్గా క్రికెట్ ఆడి యువతకు సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీసీఆర్ యుగంధర్, చిత్తూరు పార్లమెంటరీ యువత ప్రధాన కార్యదర్శి చినబాబు, పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవ రత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, మాజీ ఎంపీపీ, టిడిపి నాయకులు ఎలుమలై అమ్ములు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

నేడు భూమిపూజ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం పంచాయతీ మిట్ట దళితవాడలో రూ.2కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం భూమిపూజ చేయనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా కళ్యాణ వెంకన్న చక్రస్నానం

చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట గ్రామంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున శనివారం చక్రస్నానం వైభంగా జరిగింది. ఉదయం 6.00 గంటల నుంచి 9గంటల వరకు స్వామి, అమ్మవార్లకు తిరుమంజనం సేవను నిర్వహించారు. అనంతరం పుష్కరిణిలో శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. చక్రతాళ్వార్ పుష్కరణి నీటిలో మునిగినపుడు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులతో పాటు కుమారులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున స్నానాలు ఆచరించారు. గత 9 రోజుల పాటు నిర్విఘ్నంగా సాగిన కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ, ప్రత్యేకంగా మీడియా ప్రతినిధులకు చెవిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-కోట: గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆధ్వర్యంలో కోట మండల పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆదివారం పరిశీలనలో భాగంగా గోవిందపల్లి, పుచ్చల్లపల్లి గ్రామాల్లో ఉన్న సహాయక కేంద్రాలను సందర్శించారు. అదేవిధంగా అధికారులు కొనసాగుతున్న సహాయక చర్యలను సమీక్షించారు. బాధిత నివాసితుల శ్రేయస్సు, సహాయక చర్యల సక్రమ పనితీరును నిర్ధారించారు. వారు ఆస్తి, అవస్థాపనకు జరిగిన నష్టాన్ని ముందస్తుగా అంచనా వేసి, పునరుద్ధరణ ప్రయత్నాలను వేగవంతం చేయడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో కోట తహసీల్దార్ కటారి జయ జయ రావు, ఎంపిడిఓ వై.వేణు, డిప్యూటీ తహశీల్దార్ అజంతుల్లా ఖాన్, వీఆర్‌వోఓలు శ్రీనివాసులు, కృష్ణ, సర్వేయర్ గోపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు డిఎస్‌సి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఎస్‌జిటి, స్కూలు అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ అధికారి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2లక్షల50 వేల లోపు ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈనెల 11 నుండి 21వ తేదీ లోపు జ్ఞానభూమి వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ ఈనెల 27వ తేదీన స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారని తెలిపారు.

హైరా బొటెక్ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవం



ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న తిరుమలరెడ్డి, మాధవిరెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రపురం: తిరుపతి పట్టణం బైరాగిపట్టెడ పద్మావతి పార్క్ సమీపంలో "హైరా బొటెక్" నూతన వస్త్ర దుకాణాన్ని శనివారం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పులివర్తి సుధారెడ్డి పాల్గొన్నారు. రామచంద్రపురం మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి దంపతులు అర్చకులతో కలసి ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వస్త్ర దుకాణంను నాని దంపతులు ప్రారంభించారు. దుకాణంలో మంచి లాభాలతో విజయం సాధించాలని, వస్త్ర దుకాణంలో చీరను కొని యజమానికి బోని చేసి వ్యాపార దినదినాభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో భూపాల్ నాయుడు, సుధాకర్ చౌదరి, నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజ డెకార్స్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమహారాజ డెకార్స్ షోరూంను దసరా సందర్భంగా ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని హాజరై మహారాజ డెకార్స్ షోరూంను ఆరంభించారు. ఈ సందర్భంగా షోరూం అధినేత కొల్లూరి రాజశేఖర్ మాట్లాడుతూ ఆధునాతనమైన, నాణ్యమైన ఇంటి అలంకరణ వస్తువులను సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో డెకార్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఇందులో కర్టన్స్. బెడ్షీట్స్, టవల్స్, బ్లైండ్స్, వాల్ పేపర్స్ వంటి బ్రాండెడ్ కంపెనీలకు చెందిన వస్తువులను కాస్ట్ టూ కాస్ట్కి అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భూపాల్ నాయుడు, సుధాకర్ చౌదరి, చిల్లీస్ అధినేత అంజి, తాజ్ హోటల్ అధినేత జయచందర్ రాజు, రామ్మోహన్ వర్మ, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా రాజరాజేశ్వరి దేవి కళ్యాణం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని సూరవారిపల్లి సమీపంలో గొల్లపల్లిలో ఉన్న సురభి గో సంరక్షణ శాలలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి దేవి కళ్యాణాన్ని శనివారం వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి కళ్యాణానికి ఉభయ దాతలుగా తిమ్మరాజు పల్లికి చెందిన సీనియర్ అడ్వకేట్ మోమిడి లీలా కృష్ణ, మాజీ యంపిటీసి శ్రీదేవీ దంపతులు వ్యవహరించారు. ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని వేకువజామున మేల్కొలిపి రాజు రాజేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాలకు పంచ ద్రవ్యాలతో అభిషేకించి నూతన పట్టుపితంబరాలను కట్టబెట్టి వివిధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూమిని కబ్జా నుంచి కాపాడండి: తుంగ బాలకృష్ణ

మాట్లాడుతున్న భూ బాధితులు తుంగ బాలకృష్ణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పిల్లల భవిష్యత్తు కోసం కూడబెట్టిన ధనంతో స్థలాన్ని కొనుగోలు చేసి ఉంచితే నేడు తమ భూమి చుట్టుపక్కల ధరలు భాగా పెరిగి కోట్లకు చేరడంతో తిరుపతికి చెందిన టిడిపి నాయకుడు జేబి శ్రీనివాస్ దౌర్జన్యంగా వ్యవహరిస్తూ భూమిని కబ్జా చేస్తున్నాడని, పోలీసుల ఉన్నతాధికారులు, జిల్లా ఉన్నతాదికారులు న్యాయం చేయాలని రైల్వే కోడూరు మండలం, చిట్వేలు మండలంకు చెందిన తుంగ బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన కబ్జా వివరాలను భార్య సరస్వతి, కుమార్తె నవ్యతో కలసి మీడియాకు వివరించారు. 1997లో పిల్లపాళెం చెంగయ్య కుమారుడు పి.పొట్టెయ్య మరి కొందరి నుండి తిరుచానూరు గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 249/4/5 లోని 1 ఎకరా 36సెంట్లు భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానన్నారు. తమ స్వాధీన అనుభవంలో ఉన్న స్థలాన్ని గత 15రోజులుగా తమ స్థలానికి సమీపంలోనే నివాసముంటున్న టిడిపి నాయకుడు జేబి శ్రీనివాస్ అనే వ్యక్తి తమ స్థలాన్ని కబ్జా చేయడానికి 40 నుంచి 50 మందిని స్థలంలోకి పంపి శుభ్రం చేయించారన్నారు. దీన్ని అడ్డుకున్న తమపై చంపుతామంటూ వారు కేకలు పెడుతూ రావడంతో తాము 100కు డయల్ చేస్తే వచ్చిన పోలీసులు వారిని చూసి వెళ్ళి పోయారన్నారు. జేబి శ్రీనివాస్ తనకు ఎమ్మెల్యేల అండ ఉందని ఎక్కడికి వెళ్ళినా నన్ను ఏమి చెయ్యలేరని చెబుతున్నాడన్నారు. జేబి శ్రీనివాస్ నుంచి తమకు ప్రాణహాని ఉందని, తాను కూడా టీడీపీలో సామాన్య కార్యకర్తనని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు అయినా జోక్యం చేసుకోని న్యాయం చేయాలని వేడుకున్నారు.

రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సత్యవేడు: తమిళనాడు అరణిలో ఆదివారం జరిగిన డాక్టర్ అబ్దుల్ కలాం మెమోరియల్ ద్వితీయ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ 24పోటీలలో సత్యవేడుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిలో పట్టణంలోని దలవాయి అగ్రహారం మెయిన్ స్కూల్లో చదువుతున్న విద్యార్థి రిత్విక్ యాదవ్, మాస్టర్ స్కూల్, కింగ్స్ స్కూల్లో చదువుతున్న నజియభాను, లక్షిక ఉన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఉచిరై స్పోర్ట్స్ కరాటే అకాడమీ అధ్యక్షులు ఏడవ డాన్ బ్లాక్ బెల్ట్ శివకుమార్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ పరంధామన్ తదితరులు కరాటే పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రశంసా పత్రం, ట్రోఫీని అందించారు. దీంతో కరాటే వీరులుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ భువనేష్‌ను బహుమతులు గెలుచుకున్న విద్యార్థి తల్లిదండ్రులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆరనిలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు ఆద్యాంతం ఉత్కంఠ భరితంగా కొనసాగింది. కరాటే పోటీలో సత్తా చాటిన ముగ్గురు విద్యార్థులను ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

నిరాధార ఆరోపణలు చేస్తూ గ్రూపుల్లో పెడితే చట్టపరంగా చర్యలు

- పులివర్తి సుధా రెడ్డి

చంద్రగిరి ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న సుధా రెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): ఎక్కడో ఏవో ఆరోపణలు వస్తే అందులో తమ కుటుంబ సభ్యుల పేర్లు కలిపి కొన్ని వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి హెచ్చరించారు. తమ కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు ఉంటే వాటిని ప్రచారం చేయండి నిరాధార ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఆమె తెలిపారు. వాట్సప్ గ్రూపుల్లో అడ్మిన్‌గా ఉంటున్న కొన్ని సెల్ నెంబర్లు పేర్కొంటూ ఆమె తమ పార్టీ క్యాడర్‌తో కలిసి ఆదివారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సదరు గ్రూపులను పరిశీలించగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి పేరు ఉందని, అన్నా నీకు ఇదేమి పనులు అన్నా అంటూ నిలదీశారు. తమ కుటుంబంపై తప్పుడుగా ప్రచారం చేస్తున్నవారు మాకు బహిరంగ క్షమాపణలు తెలిపే వరకు వదిలే ప్రసక్తే లేదన్నారు. ఒక గ్రూపు అడ్మిన్‌గా ఉంటూ అవినీతి ఆరోపణలను పోస్ట్ చేస్తే అవతల వ్యక్తి ఇచ్చే వివరణను కూడా గ్రూపులో పెట్టకుండా అడ్మిన్ డిలీట్ చేయడాన్ని ఆమె తప్పుబట్టారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'చెవిరెడ్డి అన్నా మేము పుట్టుకతోనే డబ్బుల్లో పుట్టామని ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో కమిషన్ ఏజెంట్‌గా ఉండిన నీకు ఇన్ని కార్లు, ఇంత డబ్బులు ఎలా వచ్చాయని' ఆమె ప్రశ్నించారు. పోటీ పడాలంటే అభివృద్ధిలో పోటీ పడాలని గత ఐదు సంవత్సరాల చెవిరెడ్డి కాలంలో చంద్రగిరి ఏ అభివృద్ధికి నోచుకోలేదని మాతో రండి కలిసి చంద్రగిరిని అభివృద్ధి పరుద్దామని తెలిపారు. గ్రూప్ అడ్మిన్ చెవిరెడ్డి ఇచ్చే డబ్బులు తీసుకుని సంఘంలో గౌరవంగా రాజకీయాలు చేస్తున్న మాపై నిరాధార తప్పుడు ప్రచారాలు పోస్ట్ చేస్తూ వస్తే ఇకపై ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పల్లినేని సుబ్రహ్మణ్యం నాయుడు, చిత్తూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు గౌస్ బాషా, మాజీ జెడ్పీటీసీ రమేష్ రెడ్డి, సురేష్ రెడ్డి, బాల, తులసీశ్వరరెడ్డి, సుధా, గౌరి, సతీష్, కన్నయ్య నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైన మందులను ఏర్పాటు చేసుకోవాలి

- వైద్యాధికారి చైతన్య

ప్రజాశక్తి-దొరవారిసత్రం: రానున్న మూడు రోజుల్లో తుఫాను ప్రభావంతో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా ఆరోగ్య సిబ్బంది అవసరమైన మందులను సిద్ధపరచుకోవాలని వైద్యాధికారి చైతన్య సూచించారు. ఆదివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అత్యవసర తుఫాన్ సహాయక చర్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ, వైద్య సేవలకు అవసరమైన మందులన్నిటిని సిద్ధపరచుకోవాలని వెల్లడించారు. అధిక నీటి ప్రవాహంతో సమస్యలు ఎదుర్కొనే సమస్యాత్మక గ్రామాలైన వెదురుపట్టు, తనియాలి, కట్టువపల్లి గ్రామాలకు ముందుగానే అన్ని రకాల మందులను ఆయా ఆశా కార్యకర్తల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా నాలుగు ఐదు రోజుల్లో కాన్పులు సమయం వచ్చే వారందరినీ ముందు జాగ్రత్త చర్యలుగా వారిని జిహెచ్, సిహెచ్‌సి, పీహెచ్‌సీలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సలహా ఇచ్చారు. అత్యవసర సమావేశానికి హాజరుకావాలని ముందుగానే మెసేజ్ పంపిన అతిక్రమించి సమావేశానికి రాకుండా గైర్హాజరైన పిహెచ్‌సి స్టాఫ్ ఇరువురికి, ఫీల్డ్ స్టాఫ్ ముగ్గురికి క్రమశిక్షణ చర్యలు కింద షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. తుఫాను రోజుల్లో ఎవరికి అనుమతులు, సెలవులు ఉండవని హెచ్చరించారు. ఈ అత్యవసర తుఫాన్ సమావేశానికి సిహెచ్ఓ సంపూర్ణమ్మ, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్‌లు హాజరయ్యారు.

బాలికపై అత్యాచార యత్నం

- యువకుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఐదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచార యత్నం చేయగా స్థానికులు చితకబాది వన్ టౌన్ పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం పట్టణంలోని సంతమైదానంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని సంత మైదానం వద్ద వీధిలో ఆడుకుంటున్న ఓ ఐదేళ్ల బాలికను ఓ గుర్తు తెలియని యువకుడు లాక్కొని వెళ్తూ ఉండగా, ఆ వైపు వెళ్తున్న స్థానిక యువతి చుట్టుపక్కల స్థానికులకు సమాచారం ఇచ్చింది. ఈ లోపే ఆ యువకుడు చిన్నారిని నిర్మాణంలో ఉన్న ఇంటి మిద్దె పైకి తీసుకువెళ్లి అత్యాచార యత్నం చేస్తుండగా స్థానికులు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకొని విద్యుత్ స్తంభానికి కట్టివేసి దేహ శుద్ధి చేశారు. స్థానిక వన్ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. చంద్రగిరి టవర్ క్లాక్ నుంచి ఊరేగింపుగా కూటమి పార్టీల నాయకులు, మహిళలు, యువతతో కలసి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. సుధారెడ్డి పట్టు పీతాంబరాలను, పూజా ద్రవ్యాలను అర్చకులకు అందజేశారు. ఆమెకు అమ్మ వారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో మమత, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు, గౌస్ బాషా, రమేష్ రెడ్డి, ధనుంజయ రెడ్డి, మునిరత్నం రాయల్, లలిత తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

- హెల్ప్ లైన్ నెంబర్‌ను సంప్రదించండి
- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వాతావరణ శాఖాధికారుల సూచనలు మేరకు నాలుగు రోజులు పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. అందువల్ల లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు, శిథిలావస్థకు చేరిన భవనాల్లో నివసించే ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళాలన్నారు. అత్యవసర సేవలకు 7075067503, 7989995876లను సంప్రదించాలని తెలిపారు.

భువనేశ్వరి పర్యటన వాయిదా

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నారా భువనేశ్వరి కుప్పం పర్యటన వాయిదా వేస్తున్నట్లు టిడిపి వర్గాలు తెలిపాయి. ఈ నెల 14వ తేదీ నుండి నాలుగు రోజులపాటు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలలో పర్యటించవలసిన భువనేశ్వరి వాతావరణ మార్పుల కారణంగా వాయిదా వేసుకున్నారని తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా చిత్తూరు జిల్లా పరిధిలో ఈ నెల 14, 15, 16 తేదీలలో వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భువనేశ్వరి కుప్పం పర్యటన రద్దు అయ్యిందని టిడిపి వర్గాలు తెలిపాయి.

In The Cour of the Additional Senior Civil Judge of Tirupati
O.S.No.8 of 2022 and in I.A.No.47 of 2022

G.Muniraja Reddy ...Petitioner/Plaintiff
V/s
P.Sunitha and Others ...Respondents/Defadants

To,
1) L.Santhakumari W/o L.Suryanarayana Mother of Late L.Srinivasulu, Flat No.401, Nityasri Residency, Srihari Colony, Shanthi Nagar, Tirupati, Tirupati District.

Suit Summons and Notice to R1

Please take notice that the above suit and in I.A. filed by the plaintiff against defendants for recovery of suit amount are posted to 28.10.2024 for your appearance either in person or through your advocate. Failing which the above suit will be decided exparte.

(By the order of the Court)

MATTA PURUSHOTHAM REDDY
Advocate for Appellant